నూలు.. నేతన్నకు మేలు

- జిల్లా వస్త్ర పరిశ్రమకు జవసత్వాలు
- వేములవాడ మార్కెట్ యార్డులో ప్రారంభానికి ఏర్పాట్లు

ఈనాడు, సిరిసిల్ల

జిల్లాలో ఏడు దశాబ్దాల క్రితమే చేనేత నుంచి క్రమంగా మరమగ్గాలు విస్తరిస్తూ వచ్చాయి. నాటి నుంచి వస్త్ర పరిశ్రమ అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూనే వేలాది మంది నేతన్నలకు ఉపాధినిస్తోంది. ఇటీవల ప్రభుత్వం వేములవాడలో రూ.50 కోట్ల కార్పస్ ఫండ్‌తో నూలు బ్యాంకు ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసింది. వేములవాడ మార్కెట్ యార్డులో దీనిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇది అందుబాటులోకి వచ్చాక జిల్లా వస్త్ర పరిశ్రమకు నూతన జవసత్వాలు వస్తాయి.

పొరుగు రాష్ట్రాల్లో...

తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రలలో మరమగ్గాల వస్త్రోత్పత్తి సమూహాలున్న చోట నూలు ఉత్పత్తి కంపెనీలే నేరుగా విక్రయశాలలు ఏర్పాటు చేస్తాయి. అక్కడ నూలు విక్రయాల్లో మధ్య దళారీ వ్యవస్థ కనిపించదు. చిన్న, మధ్య తరగతి వస్త్రోత్పత్తిదారులు తమకు వచ్చే ఆర్డర్లకు అనుగుణంగా నూలు కొనుగోలు చేస్తారు. వాటితో నేసిన వాటిని స్వయంగా విక్రయించవచ్చు. ఇలా చేయడం వల్ల తమ నైపుణ్యంతో కళాత్మకమైన ఉత్పత్తులు వెలువడతాయి. వీటిని బహిరంగ మార్కెట్‌లో విక్రయించడం ద్వారా తమ ప్రతిభకు గుర్తింపు లభించే అవకాశం ఉంటుంది.



నూలు బ్యాంకు ఏర్పాటు చేయబోయే గోదాం

- జిల్లాలో 30,352 మరమగ్గాలపై రోజుకు సగటున మూడు లక్షల మీటర్ల పాలిస్టర్ వస్త్రోత్పత్తి జరుగుతోంది. ఇది దక్షిణ భారతదేశంలోనే అత్యధికం. ఇక కాటన్ ఉత్పత్తులు లక్ష మీటర్లలోపే ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆర్డర్లన్నీ కలిపి ఏటా సుమారు 20 వేల టన్నుల పాలిస్టర్, ఐదు టన్నులపైగా కాటన్ నూలు వాడుతారు. ఇంత వినియోగం ఉన్నా దశాబ్దాలుగా ఇక్కడ నూలు బ్యాంకులు, ప్రైవేటు నూలు విక్రయశాలలు లేకపోవడం గమనార్హం.
- జిల్లాలో వివిధ కంపెనీల నూలు విక్రయ ఏజెంట్లు, మధ్యదళారులు మాత్రమే అమ్ముతున్నారు. ప్రైవేటు నూలు కంపెనీలు నేరుగా నూలు విక్రయశాలలు ఏర్పాటు చేస్తే జిల్లా వస్త్ర పరిశ్రమలో ఉపాధితోపాటు విస్తరణకు అవకాశాలున్నాయి.

ఘనమైన చరిత్ర

జిల్లాలో సొంత ఉత్పత్తులు తక్కువ. అందుకే అయిదు దశాబ్దాలుగా మరమగ్గాల వస్త్రోత్పత్తులు జరుగుతున్నా జిల్లాకు ప్రత్యేకంగా గుర్తింపు అంటూ లేకుండా పోయింది.

- ప్రభుత్వం ఆర్డర్లు వచ్చినపుడు ముడి సరకు కొనుగోలుకు ఆర్థిక ఇబ్బందుల నుంచి ఉపశమనం లభిస్తుంది. సంఘాల వారీగా వచ్చిన ఆర్డర్లకు నూలు డిపో నుంచి ముడి సరకును తీసుకుని ఉత్పత్తి చేసిన వస్త్రాన్ని అప్పగించాలి. దీనిలో నూలు ఖర్చును మినహాయించుకుని మిగతా డబ్బులు చెల్లింపులు జరుగుతాయి. దీంతో చిన్న, మధ్య తరగతి ఆసాములు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంది.
- వస్త్రాల సేకరణకు జిల్లాలో టెస్కో ఆర్‌డీడీ (రీజినల్ డిప్యూటీ డైరెక్టర్) స్థాయి ఉద్యోగిని నియమించాలి. ప్రస్తుతం ఈ విభాగంలో తాత్కాలిక ఉద్యోగులే చూస్తున్నారు. ప్రభుత్వ ఆర్డర్లపై జిల్లాలో పర్యవేక్షణ పెంచాలి.
- మనుగడ కోల్పోతున్న కాటన్ ఉత్పత్తులతోపాటు దాని అనుబంధ రంగాలైన సైజింగ్, అద్దకం పరిశ్రమలకు పూర్వవైభవం వచ్చే అవకాశాలున్నాయి.

ప్రణాళికతో ముందుకెళ్తున్నాం

కార్మిక, ధార్మిక క్షేత్రమైన జిల్లాలో రాజన్న ఆలయ అభివృద్ధితోపాటు నేతన్నల సంక్షేమానికి ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. వేములవాడ చేనేత క్లస్టర్‌కు నూలు డిపో మంజూరైంది. దీంతో సిరిసిల్లతోపాటు గర్షకుర్తి, కొత్తపల్లి వరకు నేతన్నలకు ఎవరికి అవసరమున్నా తీసుకెళ్లవచ్చు. ప్రభుత్వ, ప్రైవేటు ఆర్డర్లకు అవసరమైన నూలు ఇక్కడ అందుబాటులో ఉంటుంది. అంచెలంచెలుగా దీని సామర్థ్యం రూ.100 కోట్లకు పెంచుతాం. త్వరలోనే ప్రారంభానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

- ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్



సిరిసిల్లలో రావణ దహనం



వీక్షేందుకు వచ్చిన జనం

ఘనంగా విజయ దశమి వేడుకలు

సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: సిరిసిల్లలో శనివారం విజయదశమి వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలో మానేరు తీరంలోని రాంలీలా మైదానంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో విజయ దశమి వేడుకలను నిర్వహించారు. ముదిరాజులు శమీవృక్షాన్ని తీసుకువచ్చి జమ్మిగద్దెపై ప్రతిష్ఠించారు. అనంతరం శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామిని అశ్వవాహనంపై ఊరేగించారు. సిరిసిల్ల పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ జిందం కళ ముఖ్య అతిథిగా పాల్గొని రావణ దహనం చేశారు. సమితి నాయకులు చేపూరి శ్రీనివాస్, గాజుల వేణు, ఆడెపు రవీందర్, మండల సత్యం పాల్గొన్నారు.

పట్టుదలతో పరిశ్రమలు పెట్టి..

స్వయం ఉపాధిలో ఆదర్శంగా నిలిచి

న్యూస్‌టుడే, సిరిసిల్ల (విద్యానగర్)

ఏదైనా సాధించాలన్న పట్టుదలే విజయానికి తొలి అడుగు. సొంత కాళ్లపై నిలబడాలనే తపనతో మహిళలు పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రుణాలు పొందుతున్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈ) పెట్టి స్వయం ఉపాధి పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

> జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం 5,122 ఎంఎస్‌ఎంఈ లక్ష్యం కాగా, 4,635 పరిశ్రమలు గ్రౌండింగ్ పూర్తయ్యాయి.



హైదరాబాద్‌లో శిక్షణ పొంది...

నేను గత నెలలో రూ.3 లక్షల రుణం తీసుకున్నా. చందుర్తి మండలం జోగాపూర్‌లో ఈవెంట్ మేనేజింగ్ పనులు నిర్వహిస్తున్నా. పెళ్లి, ఇతర శుభకార్యాలకు క్యాటరింగ్, కారు అద్దె, డీజే, బ్యూటీషియన్, డెకరేషన్ వంటివన్నీ ఏర్పాటు చేస్తాను. ఇందుకు గాను హైదరాబాద్‌లో పది రోజుల పాటు శిక్షణ పొందాను. మహిళలు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలి. అందుకు తమ ముందున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

- బిల్ల వాణి, చందుర్తి

ఐక్యతతోనే సాధ్యం

మేం ఎనిమిది మంది మహిళలం కలిసి రూ.3 లక్షల రుణం తీసుకొని సిరిసిల్లలోని వైద్య కళాశాలలో క్యాంటీన్ ఏర్పాటు చేసుకున్నాం. గత నెలలో ప్రారంభించాం. అందరం కలిసి సంతోషిమాత హోం ఫుడ్స్ పేరుతో ఈ క్యాంటీన్ నిర్వహిస్తున్నాం. మేమే సొంతంగా తయారు చేసి విక్రయిస్తున్నాం. రుణ సహాయం అందించి మహిళలను ప్రోత్సహిస్తున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- సునీత





చాలా సంతోషంగా ఉంది

నేను రెండు సంవత్సరాల క్రితం రూ.3 లక్షల రుణం తీసుకొని చందుర్తి మండలం మూడపల్లిలో సూపర్‌మార్కెట్ ఏర్పాటు చేసుకున్నా. అంతకు ముందు వ్యవసాయం చేసేదాన్ని. ప్రభుత్వం రుణ సహాయం అందించడంతో సూపర్ మార్కెట్ ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధి పొందుతున్నా. చాలా ఆనందంగా ఉంది. సకాలంలో రుణం చెల్లిస్తున్నాను. **- సుజాత**

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని మహిళలు రుణాలు పొంది సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు ఏర్పాటు చేసుకుంటున్నారు. తద్వారా స్వయం ఉపాధి పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మహిళలు అవకాశాలను అందిపుచ్చుకోవాలి. తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో నైపుణ్యాలు మెరుగుపరచుకుని ఉపాధి పొందాలి. **- శేషాద్రిరావు, డీఆర్డీవో**

గజ వాహనంపై ఊరేగిన స్వామివారు

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీరాజరాజేశ్వరి అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విజయ దశమి సందర్భంగా ఉదయం ఆలయంలో స్థానాచార్యుడు భీమా శంకర్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, శ్రీరాజరాజేశ్వరిదేవికి చతుషష్టి పూజలు జరిపారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆయుధ పూజ నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకొని ఆయుధ పూజలో పాల్గొన్నారు. సాయంత్రం శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామి, శ్రీలక్ష్మీసమేత అనంత పద్మనాభస్వామివార్ల ఉత్సవమూర్తులను అందంగా అలంకరించిన గజవాహనంపై ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహాలక్ష్మి ఆలయం వద్ద ఉన్న జమ్మిచెట్టు వద్దకు శమీయాత్ర నిర్వహించారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసిన తరవాత గజవాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. దారి పొడవునా మహిళలు మంగళహారతులతో స్వామివారికి స్వాగతం పలికి దర్శించుకొని తరించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వివిధ పార్టీల నాయకులు, అర్చకులు, ప్రజలు పాల్గొన్నారు.



ఉత్సవమూర్తుల ఊరేగింపులో అధికారులు, అర్చకులు, భక్తులు

కాజ్‌వేలు ధ్వంసం.. మరమ్మతులు పూజ్యం

- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
- కూలిపోయే దశలో ఉన్నా నిధుల మంజూరులో జాప్యం

ఈనాడు పరిశీలన

న్యూస్‌టుడే, ఎల్లారెడ్డిపేట

గత మూడు నాలుగేళ్లుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎల్లారెడ్డిపేట మండలంలోని వివిధ ప్రాంతాల్లో రహదారులతోపాటు కాజ్‌వేలు ధ్వంసమయ్యాయి. పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని కూలిపోయే దశకు చేరుకున్నా పట్టించుకున్న నాథుడు లేడు. ఏమాత్రం ఏమరుపాటుగా వెళ్లినా ప్రాణాలు గాల్లో కలిసిపోయే ప్రమాదం ఉంది.



ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ పరిధిలోని బాకురుపల్లి, బాకురుపల్లితండా గ్రామాల నడుమ రోడ్డు, కల్వర్టు ధ్వంసమై మూడేళ్లు అవుతుంది. ప్రస్తుతం కాజ్‌వే కూలిపోయే దశకు చేరుకుంది. కింది భాగంలోని మట్టి, కంకర కొట్టుకుపోవడంతో సీసీ గాలిలో వేలాడుతూ ప్రమాదభరితంగా మారింది. భారీ వాహనాలు వెళితే పూర్తిగా నేలమట్టమయ్యే దుస్థితి నెలకొంది. అయినా కాజ్‌వేను ఇప్పటి వరకు మరమ్మతు చేయలేదు.

- అల్మాస్‌పూర్ నుంచి బుగ్గరాజేశ్వరతండాకు వెళ్లే రహదారిలో వంతెన ఓవైపు పూర్తిగా ధ్వంసమైంది. కల్వర్టుల వద్ద మట్టి కోతకు గురైంది. కనీసం మట్టి పోసి, తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి నుంచి కోరుట్లపేటకు వెళ్లే రెండు వరుసల రహదారిలో కోరుట్లపేట వద్ద కాజ్‌వే, అలాగే మండల కేంద్రం నుంచి బండలింగంపల్లికి వెళ్లే రోడ్డులో రెండు కాజ్‌వేలు, అక్కపల్లి వద్ద కాజ్‌వే ఏటా వర్షాకాలంలో నీట మునుగుతున్నాయి. వాటి మీదుగా వరద ప్రవహిస్తుండటంతో వాహన రాకపోకలు స్తంభించిపోతున్నాయి. కాజ్‌వేల స్థానంలో వారధులు నిర్మించాలనే ప్రజలు, ప్రయాణికుల కోరిగా కలగానే మిగిలిపోయింది.

- ఎల్లారెడ్డిపేట మండలం పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల నడుమ చిట్టివాగుపై ఉన్న కాజ్‌వే ఇది. 2020లో రూ. 20 లక్షల ఎఫ్‌డీఆర్ నిధులతో నిర్మించారు. నిర్మాణంలో సాంకేతిక లోపాల వల్ల వరద తాకిడికి 2021లో కొట్టుకుపోయింది. రూ. లక్షలు వెచ్చించి, మరమ్మతు చేశారు. గత సంవత్సరం, ఈ ఏడాది వరదల తాకిడికి పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు ఇబ్బందిగా మారింది.



మండల కేంద్రం నుంచి సత్సంగ సదనం మీదుగా కోరుట్లపేటకు వెళ్లే రోడ్డులో ఓ కల్వర్టు కిందిభాగం కొట్టుకుపోగా సీసీ వేలాడుతోంది. దీనిపై భారీ వాహనాలు వెళితే కూలిపోయే ప్రమాదం నెలకొంది. గతంలో ఓ ట్రాక్టర్ కల్వర్టుపై నుంచి నీటిలో పడిపోగా త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. నాయకులు, అధికారులు కల్వర్టును పరిశీలించడమే తప్ప నిధుల మంజూరుకు ఎలాంటి కృషి చేయలేదు.

ప్రతిపాదనలు పంపించాం

కాజ్‌వేల మరమ్మతు కోసం ఎఫ్‌డీఆర్ నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. బాకురుపల్లి నుంచి బాకురుపల్లితండా మధ్య కాజ్‌వే మరమ్మతుకు రూ. 4 లక్షలు, కోరుట్లపేట పారేటి వాగుపై కాజ్‌వేకు రూ. 5 లక్షలు కావాలని కోరాం. పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల నడుమ చిట్టివాగుపై వంతెన నిర్మాణానికి రూ. 6 కోట్లు, రాగట్లపల్లి నుంచి నారాయణపూర్ వెళ్లే దారిలో రోడ్డు పూర్తిగా ధ్వంసమవగా కొత్తగా తారురోడ్డు నిర్మాణానికి రూ. 90 లక్షలు, అక్కపల్లి వద్ద వంతెనకు రూ. 1.50 కోట్లకు ప్రతిపాదనలు అందజేశాం. త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది.

- శ్రీనివాస్, డీఈ, పంచాయతీరాజ్‌శాఖ

జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయుధ పూజ

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: తంగళ్లపల్లి మండలం తాడూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు ఎస్పీ చంద్రయ్యలు శనివారం ఆయుధ, వాహన పూజ నిర్వహించారు. దసరా పండగ సందర్భంగా దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. శక్తికి ప్రతీకగా నిలిచే దుర్గామాత సమక్షంలో ప్రతి ఆయుధానికి ఎంతో శక్తి ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు. విజయాలను చేకూర్చే విజయదశమి పర్వదినం అందరికీ సుఖసంతోషాలు కలగాలని, శాంతి భద్రతల పరిరక్షణలో నేరాలు నియంత్రించడంలో జిల్లా పోలీసు శాఖ ముందంజలో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్ఐలు మధుకర్, యాదగిరి, రమేశ్, సీఐలు కృష్ణ, శ్రీనివాస్, సాయికిరణ్, రమేశ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పూజ చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు ఎస్పీ చంద్రయ్య



ప్రదర్శనలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నాయకులు

ఆకట్టుకున్న ఎడ్ల బండ్ల ప్రదర్శన

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ పట్టణంలో శనివారం విజయ దశమి వేడుకల సందర్భంగా ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు నిర్వహించిన ఎడ్ల బండ్ల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎడ్ల బండ్లను వివిధ రకాల పూలతో అందంగా అలంకరించి పోటా పోటీగా నిర్వహించారు. ఉదయం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జంబి గద్దె వద్ద ప్రత్యేక పూజల అనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నాయకులు ఇందులో పాల్గొన్నారు. తరవాత భారాస ఆధ్వర్యంలో జంబి గద్దె వద్ద ప్రత్యేక పూజల అనంతరం మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, నాయకులు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటస్వామి, భారాస నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి, వివిధ పార్టీల కౌన్సిలర్లు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



భారాస ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాధవి, నాయకులు

బ్యాలెట్ పెట్టెలు సిద్ధమేనా!

పల్లె పోరు నేపథ్యంలో మరమ్మతు చేయిస్తున్న అధికారులు

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

పంచాయతీ ఎన్నికల్లో కీలకమైనా బ్యాలెట్ పెట్టెలపై అధికారులు దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు నెలల్లోపు పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఇప్పటికే ఓటరు జాబితా సిద్ధం చేసిన అధికార యంత్రాంగం జిల్లా కేంద్రాల్లోని గోదాంలలో భద్రపరిచిన బ్యాలెట్ పెట్టెలను సరి చూస్తున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించి ఆరేళ్లు సమీపిస్తుండటంతో వీటిలో ఏమైనా లోపాలు ఉన్నాయా? చెడిపోయయా? అనేది తేల్చే పనిలో ఉన్నారు. చిన్న చిన్న మరమ్మతులు ఉంటే చేస్తున్నారు.

పెరగనున్న వార్డులు

2018-19 పంచాయితీ ఎన్నికలను పరిశీలిస్తే ఉమ్మడి జిల్లాలో 1,214 గ్రామ పంచాయతీల్లో 11,132 వార్డులున్నాయి. ప్రతి వార్డులో 250 ఓటర్లు ఉంటారు. ఎన్నికల్లో వార్డుకొక బ్యాలెట్ పెట్టె అవసరం కానుంది. ఇటీవల ప్రకటించిన తుది జాబితాలో ఓటర్ల సంఖ్య పెరగడంతో ఉమ్మడి జిల్లాలో వార్డుల సంఖ్య పెరగనుంది. జిల్లాల వారీగా పెరిగిన ఓటర్ల ఆధారంగా వార్డుల లెక్కలను కొలిక్కి తేనున్నారు. దీంతో అధికారులు ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న బ్యాలెట్ పెట్టెలు ఎన్ని? చెడిపోయిన ఎన్ని? అని తనిఖీ చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలకు తీసుకెళ్లిన బ్యాలెట్ పెట్టెలపై ఆరా తీస్తున్నారు. వీటిని తిరిగి తీసుకొచ్చేందుకు ప్రభుత్వానికి నివేదించనున్నారు. బ్యాలెట్ పెట్టెలు పక్కదారి పక్కకుండా ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ కొనసాగుతోంది. ఎన్నికల ప్రకటన లోపు అన్ని ఏర్పాటు సిద్ధం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.





పెద్దపల్లి వ్యవసాయ గోదాంలో బ్యాలెట్ పెట్టెలకు మరమ్మతులు చేస్తున్న అధికారులు

రిజర్వేషన్లపై వీడని ఉత్కంఠ

గత భారాస ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పదేళ్ల పాటు పంచాయతీ రిజర్వేషన్లు ఉంటాయి. అయితే ప్రస్తుత ప్రభుత్వం అదే చట్టాన్ని కొనసాగిస్తుందా? కొత్త రిజర్వేషన్లు తీసుకొస్తుందా? అన్న దానిపై ఉత్కంఠ వీడటం లేదు. ఓ వైపు బీసీ కులగణన చేయాలని సంబంధ సంఘాల నేతలు పట్టుబట్టడంతో ప్రభుత్వం సర్వే చేయాలని ఆదేశించింది. మరోవైపు ఎస్సీ వర్గీకరణ చేసే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఆయా వర్గాల వారు డిమాండ్ చేస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో అన్నది ఆసక్తికరంగా మారింది.

ప్రస్తుత పంచాయతీల వివరాలు

● జిల్లా	★ పంచాయతీలు	■ వార్డులు
జగిత్యాల	380	3,500
పెద్దపల్లి	267	2,436
కరీంనగర్	313	2,966
రాజన్నసిరిసిల్ల	255	2,230



నీరుండీ నిర్లక్ష్యం.. ఏటా దుర్భిక్షం

- ఎస్సారెస్పీ ఆయకట్టుకు తప్పని కరవు
- కాలువలకు మరమ్మతు లేక కర్షకులకు కష్టాలు


పరిశీలన

న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం, హుజూరాబాద్, పెద్దపల్లి

ఉమ్మడి జిల్లాలో ఎస్సారెస్పీ కింద దాదాపు 5.56 లక్షల ఎకరాల ఆయకట్టుంది. కాలువలు నిర్మించిన నాటి నుంచి ఇప్పటివరకు ఏనాడూ పూర్తి స్థాయిలో నీరందలేదు. దాదాపు రెండు దశాబ్దాల కిందట వేసిన సిమెంట్ లైనింగ్ దెబ్బతినడం, తూములు, డ్రాప్‌లు, యూటీలు పాడవడంతో తరచూ గండ్లు పడుతున్నాయి. నీటి వినియోగ సంఘాలు రద్దు కావడంతో నిర్వహణ అటకెక్కింది. కాలువలు భారీగా దెబ్బతిన్నా తాత్కాలిక మరమ్మతులతోనే కాలం వెళ్లదీస్తున్నారు. యాసంగి సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల పరిధిలో ఎస్సారెస్పీ కాలువల పరిస్థితిపై 'న్యూస్‌టుడే' పరిశీలన ఇది.

గరిష్ఠ నీటి నిల్వ: 80.501 టీఎంసీలు
ప్రస్తుతం 80.501 టీఎంసీలు

శ్రీరామ సాగర్ జలాశయం(ఎస్సారెస్పీ) ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యవసాయానికి ప్రాణాధారం.. ఈ ఏడాది భారీ వర్షాలకు నిండు కుండలా మారింది.. యాసంగి సీజన్ ఆరంభం కానుండగా రైతులు కోటి ఆశలతో సాగుకు సన్నద్ధమవుతున్నారు.. వారి కలలను కాలువలు వెక్కిరిస్తున్నాయి.. పూడికతో పేరుకుపోయి, పిచ్చిమొక్కలతో కమ్ముకుపోయి, ప్రవాహాన్ని ముందుకెళ్లనీయని నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నాయి.. అదనులో చేయాల్సిన పనులను గుర్తు చేస్తున్నాయి..



శ్రీరాంసాగర్ జలాశయం


1 మొత్తం ఆయకట్టు విస్తీర్ణం
2 ప్రస్తుతం సాగులో ఉన్న విస్తీర్ణం
3 మొత్తం డిస్ట్రిబ్యూటరీ కాలువల పొడవు
4 పంట కాలువల పొడవు
5 పూర్తి స్థాయిలో నీరందకపోవడానికి కారణాలు
6 సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాలు
7 మరమ్మతులకు అవసరమైన నిధులు/ ప్రతిపాదనలు
8 ఉపాధిహామీలో పూడికతీత పనులు

ఇలా చేస్తే ప్రయోజనం

- మరో రెండు నెలల్లో యాసంగి వరి నాట్లు మొదలు కానుండటంతో ఈలోగా ఉపాధిహామీలో కాలువల్లో పూడికతీత, పిచ్చిమొక్కలు, చెట్ల తొలగింపు పనులు చేపట్టాలి.
- జగిత్యాల జిల్లాలో కాకతీయ కాలువతో పాటు వరదకాలువ నుంచి చెరువుల్లోకి నీటిని తరలించే తూములు, కాలువల నిర్మాణాన్ని పూర్తి చేయాలి.
- గొలుసుకట్టు చెరువుల్లోకి నీటిని తరలిస్తే భూగర్భ జల మట్టం పెరిగి పంపుసెట్ల ద్వారా నీటిని పారించే వీలుంటుంది.
- అన్ని కాలువలకు లైనింగ్ పనులు చేయాలి. దెబ్బతిన్న నిర్మాణాలకు సీజన్ విరామంలో మరమ్మతులు పూర్తి చేస్తే చివరి ఆయకట్టు వరకు పూర్తి స్థాయిలో నీరందుతుంది.



మానకొండూర్ మండలం పచ్చునూరు శివారులో గండి పడిన డీబీఎం-6(4ఎల్) ఉపకాలువ



కరీంనగర్

1 1.40 లక్షల ఎకరాలు 2 1.12 లక్షల ఎకరాలు

3 20 డిస్ట్రిబ్యూటరీలు, 200 కిలోమీటర్లు

4 500 కిలోమీటర్లు

5 కాలువల నిర్వహణ సరిగ్గా లేకపోవడం, డ్రాప్స్, లైనింగ్, తూముల షట్టర్లు కూలిపోవడం, కాలువల్లో పిచ్చిమొక్కలు, చెట్లు పెరగడం, సిల్ట్ పేరుకుపోవడం. 6 ప్రత్యేకంగా ఏమీ లేవు.

7 రూ.20 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వానా కాలం సీజన్ నీటి విడుదల నిలిపివేసిన అనంతరం పనులు చేసేలా ప్రణాళిక రూపొందించారు.

8 మానకొండూర్, శంకరపట్నం, హుజూరాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట మండలాల్లోని సబ్ మైనర్ కాలువల్లో కొంతమేర పూడికతీత పనులు చేశారు. డిస్ట్రిబ్యూటరీలు, ఉప కాలువల్లో పనులు చేయాల్సి ఉంది.



జగిత్యాల

1 1.63 లక్షల ఎకరాలు 3 136 కిలోమీటర్లు

2 1.27 లక్షల ఎకరాలు

4 401 కిలోమీటర్లు

5 కాలువల లైనింగ్ దెబ్బతినటం, కాలువల్లో చెట్లు పెరగడం, షట్టర్లు, కట్టలు శిథిలం కావడం తదితర కారణాలతో నీటి తరలింపు సామర్థ్యం తగ్గింది. 9 వేల క్యూసెక్కుల సామర్థ్యం కలిగిన కాకతీయ కాలువలో ప్రస్తుతం 6 వేల క్యూసెక్కులకు మించి నీటిని తరలిస్తే గండ్లు పడుతుండటంతో తక్కువ నీటిని వదులుతున్నారు. యూటీలు, డ్రాపులు, సూపర్ ప్యాసేజీలు, అక్విడెక్టులు దెబ్బతినడంతో గరిష్ఠ స్థాయిలో నీటిని తరలించలేని పరిస్థితి.

6 బీర్‌పూర్, రాయికల్, జగిత్యాల రూరల్, బుగ్గారం, సారంగాపూర్, కోరుట్ల, మల్యాల, గొల్లపల్లి, ఎండపల్లి, పెగడపల్లి మండలాల్లోని చివరి ఆయకట్టు గ్రామాలకు పూర్తి స్థాయిలో నీరందడం లేదు.

7 రూ.176.31 కోట్లు. ఇటీవల రూ.91 కోట్లతో మరమ్మతులు చేశారు. 62 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి.

8 గతేడాది నుంచి దాదాపు 65 కిలోమీటర్ల దూరం కాలువల్లో పూడిక, చెట్లు, ముళ్ల పొదల తొలగింపు పనులు చేశారు. ఈ ఏడాది భారీ వర్షాలు కురవడంతో అన్ని ప్రాంతాల్లోనూ తక్షణ మరమ్మతులు చేయాల్సి ఉంది.



జగిత్యాల మండలంలో దెబ్బతిన్న కాకతీయ కాలువ లైనింగ్



పెద్దపల్లి

1 2.50 లక్షల ఎకరాలు

2 1.80 లక్షల ఎకరాలు.

3 139 కిలోమీటర్లు.

4 640 కిలోమీటర్లు.



ఎలిగేడు మండలం శివపల్లి వద్ద దెబ్బతిన్న డి-86 కాలువ (పాతచిత్రం)

5 జిల్లాలోని రెండు డిస్ట్రిబ్యూటరీ కాలువల్లో పాతికేళ్ల కిందట చేసిన లైనింగ్ పనులు దెబ్బతినడంతో ఏనాడూ పూర్తి స్థాయిలో ప్రవాహం ఉండటం లేదు. 2022 వరకు కాలువల మరమ్మతులు ఉపాధిహామీలో నిర్వహించడం, అనంతరం గ్రామ స్థాయిలోనే చేపడుతుండటంతో పర్యవేక్షణ కరవైంది.

6 ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ముత్తారం, మంథని మండలాలు,

7 జూలపల్లి మండలం కుమ్మరికుంట, పాలకుర్తి మండలం కన్నాల, కుక్కలగూడూరు వద్ద అండర్ టన్నెల్(యూటీ) కాలువల నిర్మాణానికి రూ.1.8 కోట్లతో ప్రతిపాదించారు. డి-86 పరిధిలో కాలువల మరమ్మతులకు రూ.25 లక్షలతో ప్రతిపాదనలు రూపొందించారు.

8 ప్రస్తుతం సమస్య ఉన్న గ్రామాల్లోనే పంచాయతీల ఆధ్వర్యంలో ఉపాధిహామీలో పనులు చేస్తున్నారు. కేవలం పూడికతీత, చెట్ల తొలగింపు వరకే పరిమితమవుతుండటంతో కొద్ది రోజులకే సమస్య మొదటికొస్తోంది.

కొండగట్టులో అన్నదాన సత్రం నుంచి సరకులు మాయం

మల్యాల, న్యూస్‌టుడే: కొండగట్టు అంజన్న ఆలయ అన్నదాన సత్రం నుంచి నిత్యావసర సరకులు మాయమైనట్లు తేలడంతో అధికారులు విచారణ చేపట్టారు. ఈనెల 9న అన్నదాన సత్రం నుంచి బియ్యం బస్తాలతో పాటు వివిధ రకాల నిత్యావసర సరకులను ఓ ఆటోలో అక్రమంగా తరలిస్తున్నట్లు సీసీ కెమెరాలో నిక్షిప్తం కావడంతో అధికారులు శనివారం గుర్తించారు. గతంలో కూడా సరకులు మాయమైనట్లు ఆరోపణలున్నాయి. రెండు నెలల కిందట వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం నుంచి బదిలీపై వచ్చిన రాములు(జూనియర్ అసిస్టెంట్) అన్నదాన సత్రం నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. అన్నదాన సత్రం నుంచి బియ్యంతోపాటు ఇతర సరకులు మాయమైనట్లు బయటకు పొక్కడంతో అధికారులు విచారణ చేపట్టారు. ఈ విషయమై ఈవో రామకృష్ణారావును వివరణ కోరగా రాములు అనే ఉద్యోగి అన్నదాన సత్రం నుంచి ఓ ఆటోలో అక్రమంగా సరకులు తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ విషయమై విచారణ చేపట్టామని సరకులను తరలించిన ఆటోను కూడా రప్పించి పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని పేర్కొన్నారు. ఈ విషయమై ఏఈవో అంజయ్యను సంప్రదించగా అన్నదాన సత్రం ఇన్‌ఛార్జి రాములు ఈనెల 9న గ్యాస్ సిలిండర్లు తీసుకొచ్చే ఆటోలో బియ్యం బస్తాలను, తన ద్విచక్రవాహనంలో నిత్యావసర సరకులను తీసుకెళ్లినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాలను పరిశీలించి విచారణ చేపట్టామన్నారు. ఆదివారం సాయంత్రం రాములుకు మెమో జారీ చేసినట్లు వెల్లడించారు. అన్నదాన సత్రం నుంచి ఆటోలో అక్రమంగా సరకులు తరలిస్తున్నా తనిఖీ చేయకపోవడంపై కొండపైన చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది పనితీరుపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పండుగ వేళ తీరని విషాదం

వేర్వేరు ప్రమాదాల్లో అయిదుగురి దుర్మరణం

మరో రెండు నిమిషాల్లో బంధువుల ఇంటికి చేరాల్సిన యువకుడి ప్రాణాలు గాలిలో కలిశాయి.. స్నేహితులతో కలిసి కొత్త బట్టలు కుట్టించుకుందామని వెళ్లిన ఆటో డ్రైవర్ వ్యవసాయ బావిలో విగతజీవిగా కనిపించారు.. దుర్గామాత నిమజ్జనోత్సవాల కోసం ఏర్పాట్లు చేస్తూ మరో యువకుడు విద్యుదాఘాతానికి బలయ్యారు.. అత్తగారింటికి పయనమైన ఇంకో యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు.. చిన్నతనంలో కన్నవారికి దూరమై 12 ఏళ్ల అనంతరం తిరిగొచ్చిన యువకుడు పొరుగు జిల్లాలో మృత్యువాత పడ్డారు.. శని, ఆదివారాల్లో జరిగిన పలు ప్రమాదాలు పండుగ వేళ ఉమ్మడి జిల్లాలో తీరని విషాదం నింపాయి..

-న్యూస్‌టుడే బృందం

పెద్దమ్మ ఇంటికి వెళ్తూ..



వినయ్

శంకరపట్నం: తాడికల్‌లో జరిగిన ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందారు. కేశవపట్నం ఎస్సై రవి కథనం ప్రకారం చిగురుమామిడి మండలం లంబాడిపల్లికి చెందిన బండారిపల్లి వినయ్(25) కరీంనగర్‌లో ఉంటున్నారు. శనివారం సాయంత్రం తాడికల్‌లోని పెద్దమ్మ ఇంటికి రావడానికి కరీంనగర్ నుంచి బయల్దేరారు. తాడికల్ గ్రామ శివారులోకి చేరుకోగానే మలుపు వద్ద ద్విచక్రవాహనం అతి వేగంతో అదుపు తప్పింది. రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన వినయ్ అక్కడికక్కడే మృతి చెందారు. కొన్ని క్షణాల్లో పెద్దమ్మ ఇంటికి చేరుకోవాల్సిన వినయ్ రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడటంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతుడి తండ్రి రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బావిలో విగతజీవిగా..



త్రినాథ్

మానకొండూర్ : యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మానకొండూర్ మండలం వెల్దిలో విషాదం నింపింది. సీఐ లక్ష్మీనారాయణ కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఇల్లందుల త్రినాథ్(19) ఆటో నడుపుతున్నారు. శనివారం మధ్యాహ్నం స్నేహితులు కొమ్మగల్ల కిరణ్, రుద్రారం స్వస్తిక్, రామగిరి సందీప్‌తో కలిసి ప్యాంటు కుట్టించుకోవడానికి ఆటోలో రంగపేటకు వెళ్లారు. సాయంత్రం 4 గంటలైనా ఇంటికి రాకపోవడంతో త్రినాథ్‌కు తండ్రి నాంపెల్లి ఫోన్ చేయగా బయల్దేరామని సమాధానమిచ్చారు. సాయంత్రం 7 గంటల సమయంలో 'త్రినాథ్ గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో పడ్డాడ'ని కిరణ్ ఫోన్ చేసి చెప్పారు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకోగా, పోలీసుల ఆధ్వర్యంలో బావిలో గాలించినా ఫలితం లేకపోయింది. ఆదివారం ఉదయం త్రినాథ్ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కిరణ్, స్వస్తిక్, సందీప్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

అత్తగారింటికి వెళ్తూ..



రాజు

సుల్తానాబాద్: భూపతిపూర్ శివారులోని రాజీవ్ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మంచెరామికి చెందిన సింగారపు రాజు(29) దుర్మరణం చెందారు. ఎస్సై శ్రవణ్‌కుమార్ కథనం ప్రకారం రాజు ద్విచక్రవాహనంపై దుబ్బపల్లి వైపు నుంచి భూపతిపూర్‌లోకి అత్తగారింటికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. కింద పడిన రాజుపై నుంచి మరో వాహనం వెళ్లడంతో దుర్మరణం చెందారు. మృతదేహం నుజ్జయింది. మృతుడికి భార్య, రెండేళ్లు, నాలుగు నెలల వయసున్న కూతుళ్లున్నారు.

ఉత్సవాలకు సిద్ధం చేస్తూ..



వెంకటేశం

బీమారం: బీమారం మండలం రాగోజిపేటలో దుర్గామాత ఊరేగింపు అనంతరం మహిషాసుర దహనం కోసం అరిసెల వెంకటేశం(36) తీగ చుడుతుండగా పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతంతో కింద పడిపోయారు. వెంటనే జగిత్యాల ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

తప్పిపోయి తిరిగొచ్చిన నాలుగేళ్లకే..



రవీందర్‌రెడ్డి

ఓదెల, లింగాలఘనపురం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం వడ్డిచర్ల చిన్న మోరీ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. వడ్డిచర్ల, మృతుడి గ్రామస్థులు, ఎస్సై శ్రవణ్‌కుమార్ కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం మడక గ్రామానికి చెందిన నోముల రవీందర్‌రెడ్డి(32) నల్గొండలో ఎగ్గిబిషన్ నిర్వహిస్తున్నారు. రెండేళ్ల కిందట తండ్రి రాంచంద్రారెడ్డి మృతి చెందగా తిథి కోసం కారులో స్వగ్రామానికి వస్తుండగా జనగామ-సూర్యాపేట జాతీయ రహదారిలో లింగాలఘనపురం మండలంలోని వడ్డిచర్లలో కారు అదుపుతప్పి డివైడర్‌ను, కల్వర్టు గోడను ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రవీందర్‌రెడ్డిని స్థానికులు 108లో జనగామ జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందారు. రవీందర్‌రెడ్డి జమ్మికుంటలో చదువుతున్న సమయంలో తప్పిపోయి 12 సంవత్సరాలు తల్లిదండ్రులకు దూరమై నాలుగేళ్ల క్రితమే స్వగ్రామం వచ్చారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ప్రియుడి హత్యతో మనస్తాపం
మహిళ బలవన్మరణం

గుంటూరు, యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: ప్రియుడు హత్యతో మనస్తాపానికి గురైన వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గుంటూరు నల్లచెరువుకు చెందిన కాకినాడ అంజలి(29)కి.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన శివరామకృష్ణలకు కొన్నేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. యైంటిక్లయిన్‌కాలనీ హనుమాన్‌నగర్‌కు చెందిన వడ్డాది వినయ్‌కుమార్‌తో ఆమెకు పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. మూడు నెలలుగా భర్త, పిల్లల్ని వదిలిన అంజలి ప్రియుడితో సహ జీవనం చేస్తోంది. ఈ నెల 10న అంజలి భర్త శివరామకృష్ణ, సోదరుడు కుమార్‌లు కలిసి వినయ్‌కుమార్‌ను హత్య చేశారు. ఈ కేసుకు సంబంధించి గోదావరిఖని పోలీసులు శివరామకృష్ణ, కుమార్‌లను శనివారం అరెస్టు చేశారు. అప్పటి నుంచి అంజలి గుంటూరు నల్లచెరువులోని తన కుటుంబసభ్యులు వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా వారు నిరాకరించారు. ఓవైపు ప్రియుడు హత్యకు గురి కావటం.. కుటుంబ సభ్యులు నుంచి ఆదరణ లేకపోవటంతో తీవ్ర మనస్తాపానికి గురైన అంజలి.. శనివారం గుంటూరు వర్కర్స్‌కాలనీలోని తన పిన్ని కనకలక్ష్మి ఇంటికి వచ్చింది. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. లాలాపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కళ్లెదుటే రైలు కింద పడి భర్త...

ఓదెల : వేధింపులపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆమె కళ్లెదుటే భర్త రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఓదెల మండలం పొత్కపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జీలకుంట గ్రామానికి చెందిన రెడ్డి ఆదిత్య(32) పొత్కపల్లి గ్రామ పరిధిలోని గొల్లపల్లిలో నివాసముంటున్నారు. మద్యానికి బానిసై తరచూ భార్య కవితను వేధింపులకు గురి చేసేవారు. ఆదివారం సాయంత్రం కూడా ఆదిత్య భార్యతో గొడవపడ్డారు. దీంతో కవిత స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నీపై ఫిర్యాదు చేసి వచ్చినట్లు భర్తతో తెలిపింది. నాపై పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ ఇంటి పక్కనే ఉన్నా రైల్వేట్రాక్ పైకి పరుగెత్తుకుంటూ వెళ్లి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి భార్య చూస్తుండగానే ఆత్మహత్య చేసుకున్నారు. ఆదిత్యకు కుమారుడు, కూతురు ఉన్నారు.

ఆ బస్సులకు మహిళలే యజమానులు

న్యూస్‌టుడే, కరీంనగర్ పట్టణం, రవాణా విభాగం

- 61 మండల సమాఖ్యలతో కొనుగోలు
- ఆర్టీసీకి అద్దె.. అతివలకు ఉపాధి
- పైలట్ ప్రాజెక్టుగా కరీంనగర్ జిల్లా

మహిళా ప్రగతి రథ చక్రాలు రోడ్డెక్కేందుకు కార్యాచరణ మొదలైంది. మండల మహిళా సమాఖ్యలతో బస్సులు కొనుగోలు చేయించి.. ఆర్టీసీకి అద్దెకు ఇప్పించి.. వారికి ఉపాధి అవకాశాన్ని కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామీణాభివృద్ధి శాఖ, టీజీఎస్-ఆర్టీసీ రవాణా శాఖల సంయుక్త నిర్వహణలో ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే బస్సులను మహిళా సంఘాల ద్వారా తీసుకోవాలన్న నిర్ణయంలో భాగంగా మొదట మూడు జిల్లాలను పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేయగా అందులో కరీంనగర్ ఉమ్మడి జిల్లా కూడా ఒకటిగా ఉంది. మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాలను కూడా చేర్చారు.

ఉమ్మడి జిల్లాలో వివరాలు ఇలా...

జిల్లా	మండలాలు	కొనుగోలు బస్సులు
కరీంనగర్	15	15
జగిత్యాల	20	20
పెద్దపల్లి	14	14
సిరిసిల్ల	12	12

ప్రాథమికంగా నిర్ణయం..

ఈ బాధ్యతను మెప్మాతోపాటు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలు చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 61 మండల మహిళా సమాఖ్యలు ఉన్నాయి. వాటి ఖాతాల్లో ఉన్న కొంత డబ్బుతోపాటు బ్యాంకు రుణ సదుపాయం, ప్రభుత్వ రాయితీ వంటి వాటిని జోడించి బస్సులు కొనుగోలు చేయాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. అద్దె బస్సుల్లోనూ అవసరమైన వారికి ఉపాధి కల్పించే అవకాశముంది. ఇందుకు అవసరమైతే వారికి శిక్షణ ఇవ్వనున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని



కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల పరిధిలో మహిళా శక్తిని చాటే అవకాశముంది. మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 100 నుంచి 150 సంఘాలకు బ్యాంకు రుణాలు ఇప్పించి వాటి ద్వారా బస్సులు కొనాలనేది ప్రభుత్వ ఉద్దేశం.

తీరనున్న బస్సుల కొరత..

కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోల్లో 860 బస్సులు ఉండగా, ఇందులో 333 అద్దెవి ఉన్నాయి. ఇవి కాకుండా ఇటీవల 33 ఎలక్ట్రిక్ బస్సులు కూడా అందుబాటులోకి వచ్చాయి. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత ప్రయాణికుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. అంతకుముందు రీజియన్ వ్యాప్తంగా 2 లక్షల మంది ప్రయాణించగా పథకం అమల్లోకి వచ్చాక ఈ సంఖ్య అయిదు లక్షలకు చేరింది. ఉన్న వాటితోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు కొన్ని సందర్భాల్లో పరిమితికి మించిన ప్రయాణికులతో వెళుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మండల మహిళా సమాఖ్యల ద్వారా బస్సులు కొనుగోలు చేయించి, ఆర్టీసీకి అద్దెకు ఇవ్వాలని నిర్ణయించింది. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 61 బస్సులు అందుబాటులోకి రానున్నాయి. బస్సుకు ఇద్దరు చొప్పున చోదకులను తీసుకున్నా మరో 122 మందికి ఉపాధి లభించనుంది.

విధి విధానాలు రూపొందిస్తున్నాం

మండల సమాఖ్యల ద్వారా బస్సుల కొనుగోలుకు సంబంధించిన విధి విధానాలు రూపొందిస్తున్నాం. మొదట కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్ అమలు చేసిన తర్వాత అన్ని జిల్లాలకు విస్తరింపజేస్తాం. మహిళా శక్తి ద్వారా ఉపాధి కల్పించనున్నాం. త్వరలోనే తుది రూపకల్పన ప్రకటిస్తాం.

- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

రాజన్న ఆలయానికి భక్తుల తాకిడి

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి స్వామివారి దర్శనానికి భారీగా తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు కిటకిటలాడాయి. ఆలయ ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు కోడె మొక్కులు చెల్లించుకున్నారు. దాదాపు 25 వేల మంది రాజన్నను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

కోదండరామస్వామిని దర్శించుకున్న సినీనటుడు చిన్నా

నాగారం (కోనరావుపేట), న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం నాగారం గుట్టపైన వెలసిన కోదండరామస్వామిని సినీనటుడు చిన్నా ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారికి పూజలు చేశారు. చిన్నాను పలువురు శాలువాతో సన్మానించారు. సినిమా చిత్రీకరణకు ఆలయ గుట్ట అనువైన ప్రదేశమని సినీ నటుడు చిన్నా పేర్కొన్నారు.


చిన్నాను సన్మానిస్తున్న గ్రామస్థులు, మాజీ ప్రజాప్రతినిధులు

అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యకు డిమాండ్

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ పాలనలో రెవెన్యూ అధికారులు అనేక తప్పుడు రికార్డులు సృష్టించారని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. ఆదివారం సిరిసిల్లలో ఆయన అఖిలపక్ష నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల పట్టణ పరిధిలోని చిన్నబోనాలకు చెందిన మెండయ్య అనే వ్యక్తికి గుంట భూమి లేకున్నా 9వ ప్యాకేజీలో భూమి కోల్పోయాడని రూ.8 లక్షల పరిహారం ఇచ్చారని ఆరోపించారు. చనిపోయిన వారి పేరిట ప్రస్తుతం భూమి ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయని, జగిత్యాలలో పని చేస్తున్న ఆర్‌ఐ సిరిసిల్లలో రికార్డులు తయారు చేయడంలో ఆంతర్యమేమిటో ఉన్నతాధికారులు చెప్పాలన్నారు. నిర్వాసిత భూముల్లో అనేక అక్రమాలు జరిగినా తహసీల్దార్, ఉన్నతాధికారులు పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. బోనాలలో రూ.3.60 కోట్లను భూమిలేని వారికి, అసైన్డ్ భూమి ఒకరి పేరున ఉంటే మరొకరికి చెల్లించిన సందర్భాలున్నాయని ఆరోపించారు. ఇలాంటి అక్రమాలపైన, తప్పుడు రికార్డులు సృష్టించిన వారిపైన పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ నాయకుడు రాగుల రాము, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ కనుకయ్య, అఖిల పక్ష నాయకులు శివరాజు, నాగరాజు, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవమాన భారంతో యువకుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: అవమానభారంతో ఓ యువకుడు శనివారం ఆత్మహత్య చేసుకున్న సంఘటన పండగ పూట ఆ ఇంట్లో విషాదాన్ని నింపింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... తంగళ్లపల్లి మండలం కేసీఆర్‌నగర్‌కు చెందిన దబాసి సాయికృష్ణ (27) నూతి అనిల్ వద్ద రూ.20 వేలు అప్పు తీసుకున్నాడు. అనిల్ సాయికృష్ణ ఇంటికి వెళ్లి నీవు ఇచ్చిన డబ్బులు ఇవ్వమని ఇస్తావా, కట్టకపోతే చంపుతానని బెదిరించాడు. అతని చరవాణిని బలవంతంగా తీసుకెళ్లాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై, అవమానభారంతో దసరా పండగ రోజు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై తల్లి విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి యువకుడి మృతికి కారణమైన అనిల్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు. మృతుని భార్య ఉదయశ్రీ, ఒక కుమారుడు, తల్లిదండ్రులు నారాయణ, విజయ ఉన్నారు.


సాయికృష్ణ

నేర వార్తలు

వివాహిత అనుమానాస్పద మృతి

వీర్నపల్లి, న్యూస్‌టుడే: వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన వీర్నపల్లి మండలం జవహర్‌లాల్‌నాయక్‌తండాలో ఆదివారం వెలుగుచూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తండాకు చెందిన గుగులోతు సుశీల (42), భర్త రవి దంపతులు స్థానికంగా వ్యవసాయ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. కొద్ది సంవత్సరాలుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో వారం రోజుల క్రితం ఇద్దరి మధ్య గొడవ తలెత్తడంతో సుశీల డయల్ 100కు ఫిర్యాదు చేసింది. అక్కడికి చేరుకున్న పోలీసులపై భర్త రవి దాడికి పాల్పడ్డాడు. సుశీల లాల్సింగ్‌తండాలోని తల్లిగారింటికి వెళ్లింది. పెద్దమనుషుల సూచన మేరకు పండగ కోసం భర్త దగ్గరికి వచ్చిన సుశీల ఆదివారం ఇంటి ఎదుట మంచంపై విగత జీవిగా కనిపించింది. మృతురాలికి కుమార్తె షర్మిల, కుమారుడు సాయిచరణ్ ఉన్నారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. ఘటనా స్థలంలో ఆధారాలను క్లూస్ టీం సభ్యులు సేకరించారు. మృతురాలి అన్న లోక్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్లయ్య పేర్కొన్నారు. శవపరీక్ష కోసం మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు.


సుశీల

భర్త పరారీ...

దంపతుల మధ్య ఇటీవల జరిగిన గొడవతో ఆమె కుమార్తె, కుమారుడు అమ్మమ్మ ఊరు లాల్సింగ్‌తండాలో ఉంటున్నారు. సుశీల భర్త రవితోపాటు జవహర్‌లాల్‌నాయక్‌తండాలో ఉంది. సుశీల తన బంధువులతో శనివారం రాత్రి చరవాణిలో మాట్లాడింది. ఆమె చనిపోయిన తర్వాత భర్త ఉదయం పరారయ్యాడు. ఆమెను హతమార్చినట్లు పలువురికి చెప్పినట్లు సమాచారం. అనంతరం అడవిలోకి వెళ్లిన నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు బృందాలుగా అటవీ ప్రాంతంలో గాలించారు. అయినప్పటికీ రవి ఆచూకీ లభించలేదు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు...

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పని చేసే కొప్పూరి మాధవ (27) ఈ నెల 11న అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై రమాకాంత్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం మేరకు... నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌కు చెందిన మాధవ గత మూడు సంవత్సరాలుగా మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో డయాలసిస్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. మండల కేంద్రంలో ఓ గదిని అద్దెకు తీసుకొని, సహచరులతో కలిసి ఉంటున్నాడు. ఎప్పటిలాగే పని ముగించుకొని ఈ నెల 11న రాత్రి గదికి వెళ్లి నిద్రించాడు. అతనితో కలిసి ఆసుపత్రిలో పని చేసే సహచరుడు అజిత్‌కుమార్ అదే రాత్రి 11.30 గంటల ప్రాంతంలో గదికి వెళ్లి పిలవగా ఎలాంటి స్పందన లేదు. దీంతో అజిత్‌కుమార్ ఆ రోజు రాత్రి ఆసుపత్రిలో నిద్రించాడు. మరుసటి రోజు శనివారం ఉదయం ఇంటి యజమానితో కలిసి తలుపులు పగులకొట్టి చూడగా మాధవ చనిపోయి ఉన్నాడు. మృతుడి సోదరుడు శేషగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించామని, నివేదిక రాగానే మాధవ మృతికి కారణాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటలో మద్దికుంట బాలకిషన్‌పై, అదే గ్రామానికి చెందిన ద్యాగరి అభిరామ్ ఆదివారం దాడి చేసి కొట్టగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. మద్దికుంట బాలకిషన్ క్షౌరవృత్తిలో కొనసాగుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని పేర్కొన్నారు. ఎప్పటిలాగా సాయంత్రం సెలూన్ దుకాణంలో క్షౌరం చేస్తుండగా అభిరామ్ అక్కడికి చేరుకొని అకారణంగా తిడుతూ చేతులు, చెప్పులతో కొట్టాడని తెలిపారు. ఎప్పటికైనా చంపుతానని బెదిరించగా బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

అనుసంధాన దారులు అధ్వానం

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

న్యూస్‌టుడే, కోనరావుపేట

అనుసంధాన రహదారులు అధ్వానంగా మారాయి. తారు రోడ్లగా మార్చి మారుమూల గ్రామాలకు రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు అవసరమైన నిధుల కోసం చేసిన ప్రతిపాదనలకు ఏళ్లుగా మోక్షం లభించడం లేదు. దీంతో చిన్నపాటి వర్షానికి గుంతలమయంగా మారి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కోనరావుపేట మండలం మంగళ్లపల్లి, సుద్దాల-రామన్నపేట, పల్లిమక్త-నాగారం గ్రామాల మధ్య రహదారులు గుంతలమయంగా మారాయి.


మంగళ్లపల్లి రోడ్డు దుస్థితి

- దశాబ్దకాలం క్రితం ఉపాధి హామీ నిధులతో చేపట్టిన కంకర రోడ్లు పూర్తిగా మరమ్మతుకు గురయ్యాయి. చిన్నపాటి వర్షానికి సైతం చిత్తడిగా మారుతున్నాయి.
- వర్షపు నీరు గుంతల్లో నిలిచి ఉండటంతో వాహనదారులు అంచనా వేయలేక ప్రమాదాల బారినపడుతున్నారు.
- తారు రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు కోసం అధికారులు పలుమార్లు ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు సొంత వాహనాలపైనే ఆధారపడుతున్నారు.
- పక్కా రహదారులు నిర్మించాలని పలుమార్లు అధికారులు, పాలకులను కోరినా స్పందన లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోయారు.
- వేములవాడ గ్రామీణ మండలం హన్మాజీపేట నక్కవాగులో తాత్కాలిక రోడ్డు కోతకు గురై రాకపోకలు నిలిచిపోవడంతో పలు గ్రామాల వాహనదారులు మంగళ్లపల్లి మీదుగా వెళ్తున్నారు. దీంతో ఈ మార్గం రద్దీగా మారింది. అధ్వానంగా ఉన్న దారిలో అవస్థలు పడుతున్నారు.

వాహనాలు పాడవుతున్నాయి



నాకున్న అయిదెకరాలతోపాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. ఎనిమిది ఎకరాల్లో పత్తి సాగు చేశాను. ఎకరంలో పూలు, కూరగాయలు, మిర్చి పండిస్తున్నాను. నిత్యం సేకరించిన పూలు, కూరగాయలను మార్కెట్‌కు, వార సంతలకు తీసుకెళ్లడానికి ఇబ్బందిగా మారింది. రోడ్డు బాగా లేక వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాం. రెండు పర్యాయాలు కేవలం కిలో మీటర్ తారు రోడ్డుకు నిధులు మంజూరైనట్లు ప్రకటించారు. పనులు మాత్రం చేపట్టలేదు. **- సాండేసారి తిరుపతి, రైతు, మంగళ్లపల్లి**

రవాణా వ్యవస్థ మెరుగుపర్చాలి



సుద్దాల, మంగళ్లపల్లి, రామన్నపేట గ్రామాల ప్రజలు ముఖ్యంగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. వ్యవసాయ క్షేత్రాల నుంచి పంట ఉత్పత్తులను తరలించడానికి ఇబ్బంది ఉంది. పాలకులు, అధికారులు స్పందించి తారు రోడ్డు నిర్మాణం చేపడితే రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుంది.

- కచ్చకాయల మహేశ్, వాహనదారుడు, సుద్దాల

ప్రతిపాదనలు పంపించాం



గ్రామాలను అనుసంధానం చేసేలా తారు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించాం. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన నిధుల కోసం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర ప్రభుత్వ నిధులు మంజూరు చేయించేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టి సారించారు. త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశాలు ఉన్నాయి. నిధులు రాగానే టెండరు ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటాం.

- భూమేశ్వర్, పంచాయతీరాజ్‌శాఖ ఈఈ, సిరిసిల్ల

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థి ఎంపిక

నామాపూర్ (ముస్తాబాద్), న్యూస్‌టుడే: ఈ నెల 14 నుంచి గద్వాల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ముస్తాబాద్ మండలం నామాపూర్ జడ్పీ పాఠశాల 9వ తరగతి విద్యార్థి వికాస్ వర్ధన్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ఈ నెల 4న జిల్లా కేంద్రంలో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడల్లో అండర్-14 విభాగంలో పాల్గొని ప్రతిభ కనబరిచాడని పేర్కొన్నారు. దీంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీడీ కుంట శ్రీనివాస్‌ను ఉపాధ్యాయ బృందం అభినందించింది.

హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ

సుద్దాల (కోనరావుపేట), న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం సుద్దాలకు చెందిన యువకుడు దొబ్బల జశ్వంత్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధించాడు. తెలంగాణ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలో ఈనెల 9 నుంచి 11 వరకు పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు తరఫున పాల్గొని ప్రతిభ కనబర్చాడు

లైసెన్స్ లేని పత్తి వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

బోయినపల్లి, న్యూస్‌టుడే: లైసెన్స్ లేకుండా గ్రామాల్లో రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తూ దోపిడీ చేస్తున్న వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్ డిమాండ్ చేశారు. నీలోజిపల్లిలో రైతులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. వాతావరణం అనుకూలించకపోవడంతో ఎకరానికి ఎనిమిది క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం లేదన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పత్తికి మద్దతు ధర రూ.7500 చెల్లించాలన్నారు. రైతులు శంకర్, నాగరాజు, రవి, రాములు, రవి, వెంకట్‌రెడ్డి, లింగయ్య పాల్గొన్నారు.


రాచర్ల బొప్పాపూర్‌లో రావణ దహనం


చందుర్తి: తిమ్మాపూర్‌లో...


తంగళ్లపల్లిలో ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో...


వీర్నపల్లిలో పోలీసుల ఆయుధ పూజ

అంబరాన్నంటిన దసరా సంబరాలు

దసరా వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. వాహనాలకు పూజలు చేసేందుకు బారులు తీరారు. దుర్గామాత, శమీ పూజలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు జమ్మి ఆకు ఇచ్చిపుచ్చుకుంటూ ఆత్మీయ ఆలింగనం చేసుకుని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

- న్యూస్‌టుడే బృందం


మామిడిపల్లిలో శమీ పూజ చేస్తున్న గ్రామస్థులు


ముస్తాబాద్ ఠాణాలో...


ఎల్లారెడ్డిపేటలో వేడుకలకు భారీగా హాజరైన జనం


గంభీరావుపేటలో...


రుద్రంగిలో...


మల్లారంలో...


కనగర్తిలో శమీ పూజ


మల్కపేట వేడుకల్లో భారాస వేములవాడ నియోజకవర్గ బాధ్యుడు చల్మెడ లక్ష్మీనరసింహారావు


ఎల్లారెడ్డిపేటలో శమీ పూజ


అగ్రహారం ఆంజనేయస్వామి ఆలయం వద్ద వాహన పూజ

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

గంభీరావుపేట, న్యూస్‌టుడే: గంభీరావుపేట మండలం దమ్మన్నపేట ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న తాడూరి సంపత్ కుమార్ ఇటీవల జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారం అందుకొన్నారు. దసరా సందర్భంగా హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ హైదరాబాద్‌లోని నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో సంపత్ కుమార్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు బండారు దత్తాత్రేయలు ఘనంగా సన్మానించారు. మీలాంటి ఉపాధ్యాయులు రాష్ట్రానికి అవసరమని కొనియాడినట్లు తెలిపారు.


సన్మానం పొందుతున్న ఉపాధ్యాయుడు సంపత్‌కుమార్

ఆర్‌ఎస్‌ఎస్ కవాతు

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శత వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఇల్లంతకుంట మండల కేంద్రంలో కరసేవకులు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో మండల పురోహిత సంఘం అధ్యక్షుడు చెరుకు పవన్ శర్మ, కరసేవకులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన వారికి సత్కారం

కోనరావుపేట, న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన మర్యాల కార్తీక్, డప్పుల సుజాత ఉపాధ్యాయ కొలువు సాధించారు. దీంతో వారిని మిత్రులు ఆదివారం శాలువాలతో ఘనంగా సన్మానించారు.

చదువే సకల సమస్యలకు పరిష్కారం


ఉద్యోగాలు సాధించిన యువతీ యువకులను సన్మానిస్తున్న దృశ్యం

గంభీరావుపేట, న్యూస్‌టుడే: చదువే సకల సమస్యలకు దారి చూపుతుందని, చదువుకునే సమయంలో ఇబ్బందులు కలిగినా నిర్లక్ష్యం చేయవద్దని నర్మాల గ్రామానికి చెందిన రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ సీఐ మరారి చంద్రశేఖర్ తెలిపారు. గంభీరావుపేట మండలం నర్మాల గ్రామంలో ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతీ, యువకులతోపాటు వారి తల్లిదండ్రులను సీఐ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టానికి తగ్గ ఫలితం వచ్చిందన్నారు.


గంభీరావుపేటలో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

గంభీరావుపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని బాలుర, బాలికల, విజ్ఞాన విద్యాలయంలో 2003-04 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని కేజీ టు పీజీ ప్రాంగణంలో సమావేశమయ్యారు. ఒకరి యోగక్షేమాలను ఒకరు అడిగి తెలుసుకున్నారు. ఆట, పాటలతో సందడి చేశారు. చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.


బోయినపల్లి: గురువులతో పూర్వ విద్యార్థులు


బోయినపల్లి: బోయినపల్లిలోని ఆనంద్ విద్యానికేతన్‌లో 2013-14 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు.

ప్రాణం మీదకు తెచ్చిన ఈత పందెం

ముస్తాబాద్, న్యూస్‌టుడే: ఈత కొట్టాలంటూ యువకులు సరదాగా కట్టిన పందెం ఓ యువకుడి ప్రాణం మీదకు వచ్చిన సంఘటన ఆదివారం ముస్తాబాద్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... మండల కేంద్రానికి చెందిన సుమన్ పెద్ద చెరువులో ఈ గట్టు నుంచి ఆగట్టుకు ఈత కొట్టేందుకు మరికొందరు యువకులతో సరదాగా పందెం కాశాడు. దీంతో సుమన్ చెరువు మధ్యలోకి వెళ్లి అలసిపోయి అక్కడే తచ్చాడుతుండగా అటుగా వెళ్లిన జడ్పీటీసీ మాజీ సభ్యుడు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచి ఓరగంటి తిరుపతి గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై గణేశ్ హుటాహుటిన సిబ్బందితో చెరువు వద్దకు చేరుకున్నారు. ట్రాక్టర్ ట్యూబ్‌లో గాలి నింపి చెరువులోకి వెళ్లి ఎట్టకేలకు యువకుడిని రక్షించారు. సరదాగా చేసే పందెం ప్రాణాలకు ముప్పు కలిగిస్తుదంటూ యువకులకు కౌన్సెలింగ్ చేసి పంపించేశారు.

పర్వతాన్ని అధిరోహించిన విద్యార్థినికి సన్మానం

వేములవాడ, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్‌లో మనాలిలోని 4,250 మీటర్ల ఎత్తు కలిగిన మౌంట్ పటేల్స్‌ను అధిరోహించిన వేములవాడ పట్టణానికి చెందిన సన్నితను ఆదివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శాలువాతో సన్మానించారు. పర్వతాన్ని అధిరోహించడానికి దాదాపు 12 గంటలు పట్టినట్లు ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు లక్ష్మీనారాయణ, పులి ప్రసన్న, హరికృష్ణ, తిరుపతి, మల్లేశం, సంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.


వెంకంపేటలో దుర్గాదేవిని ఊరేగింపు


బావుసాయిపేటలో ...


గంభీరావుపేటలో...

కమనీయంగా దుర్గామాత శోభాయాత్ర


చందుర్తి: తిమ్మాపూర్‌లో...

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి దుర్గాదేవి శోభాయాత్రను కమనీయంగా నిర్వహించారు. రంగు రంగుల విద్యుత్తు దీపాలు, పూలతో అందంగా అలంకరించిన వాహనాల్లో అమ్మవారి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. చిన్నారులు, యువతీ, యువకులు, మహిళల కోలాటం, నృత్యాల నడుమ అమ్మవారు ముందుకు సాగారు. మహిళలు మంగళహారతులు సమర్పించారు. శోభాయాత్ర అనంతరం సమీప నీటి వనరుల్లో నిమజ్జనం చేశారు. మండపాల నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే యంత్రాంగం


తడగొండలో...


ఎల్లారెడ్డిపేటలో...


మహిళలు, యువతుల కోలాటం


కనగర్తిలో...